క్లుప్తంగా

ముత్యాలమ్మకు బోనాలు



నందిగామ టౌన్: మండలంలోని రామిరెడ్డిపల్లిలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మేళతాళాలు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి బోనాలు, పాలపొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

పెనుగంచిప్రోలు: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపేవారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పెనుగంచిప్రోలు ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ హెచ్చరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్యే



వేదాద్రి(జగ్గయ్యపేట): దేవాలయాల అభివృద్ధికి భక్తులు ముందుకు తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారు. వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైనున్న జ్వాలా నరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు పక్కన ఆదివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాట్ డ్డు నిర్మాణానికి సహకరించిన హైదరాబాద్‌కు చెందిన దాత హరి సేవలు అభినందనీయమన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

కంచికచర్ల: కంకరలోడు లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కంచికచర్ల మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బోనగిరి రాజు కథనం మేరకు విజయవాడ మాచవరంనకు చెందిన కే శివరావు అనేవ్యక్తి మరోవ్యక్తితో కలిసి హైదరాబాద్‌వైపు నుంచి కారులో విజయవాడ వెళ్తున్నారు. వీరి కారు మండలంలోని పరిటాల శివారు దొనబండ సమీపంలోకి రాగానే మెటల్ క్వారీలోంచి హైవేపైకి వచ్చిన కంకరలోడుతో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈఘటనలో శివరావుతోపాటు కారులో ఉన్న మరోవ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే వాహన అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వైద్య చికిత్స కోసం విజయవాడలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


ఓటు నమోదు కేంద్రం ఏర్పాటు

కంచికచర్ల: స్థానిక ఏపీ ఎన్జీఓ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుందరయ్య ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులంతా ఈ కేంద్రం ద్వారా తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా కార్యదర్శి డి.హరిప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, వై.ఏడుకొండలు, కె.వెంకట్, పూల వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, హఫీజుల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సీఐగా బాధ్యతలు స్వీకరించిన పోలాకి వెంకటేశ్వర్లు ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్యకు సీఐ పూలమొక్కను అందజేయగా, సీఐకి ఆయన అభినందనలు తెలియజేశారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడటంలో సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు.

ఆటో పల్టీ-డ్రైవర్ మృతి



కంచికచర్ల: ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టడంతో డ్రైవర్ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు పరిటాలకు చెందిన గంజి నాగరాజు(32) కిరాయి నిమిత్తం గనిఆత్కూరుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో పంటపొలాల్లోకి దూసుకుపోయి పల్టీకొట్టింది. ఈ ఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పెనుగంచిప్రోలు శివారు పొలాల్లో నిల్వ చేసిన ఇసుక కుప్పలు



వత్సవాయి మండలం భీమవరంలో రోడ్డుపక్కన ఉన్న ఇసుక డంప్

ఇసుక తోడేస్తున్నారు

కూటమి నాయకుల ఇసుక దందా

- మునేరు నుంచి భారీగా ఇసుక తరలింపు
- ఎక్కడ చూసినా ఇసుక డంప్‌లు
- రీచ్‌లను చూసి ఖిన్నులైన అధికారులు
- ఇసుక తవ్వకాలు నిలిపివేత

పెనుగంచిప్రోలు/వత్సవాయి: ఇసుక అక్రమ రవాణాదారులు పేట్రేగిపోతున్నారు...మునేరు నుంచి వేలాది టన్నుల ఇసుకను అక్రమంగా తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మునేరు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం రీచ్‌ల నుంచి బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ఆదేశాలు జారీకావడంతో కొందరు అధికారపార్టీ నాయకులు ఇదే అదనుగా భావించి వేలాది టన్నుల ఇసుకను ఇప్పటికే తోడేశారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అవసరం ఉన్నా, లేకపోయినా మునేరు నుంచి తరలించేశారు.

పెద్దఎత్తున ఇసుక నిల్వలు...

ఇసుకను ట్రాక్టర్ల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలించి పెద్దఎత్తున డంప్ చేశారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పలు ప్రదేశాల్లో డంప్ చేసి రాత్రుళ్లు గుట్టుచప్పుడు కాకుండా లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. అలాగే పగలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, పక్క మండలాలకు తరలించకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదు. ఇతర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మునేరులో తాగునీటి పథకాల పక్కన కూడా ఇసుక తోడేస్తుండటంతో మూడు రోజుల కిందట వత్సవాయి మండలం లింగాల మునేరులో ఇసుక రవాణాను అధికారులు నిలిపి వేశారు. అలాగే పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామంలో జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించిన ఇసుకరీచ్‌లోనూ కూడా మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమాలు జరుగుతున్నాయంటూ ఇసుక తవ్వకాలను నిలిపి వేశారు. ప్రభుత్వం నిర్ణయించిన శనగపాడు, పెనుగంచిప్రోలుతోపాటు వత్సవాయి మండలంలోని లింగాల, ఆళ్లూరుపాడు గ్రామాల్లో రెండు రోజులుగా ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయింది.

అక్రమరవాణాకు అడ్డుకట్ట ఏది?..

ఇసుక అక్రమాలపై సమాచారం అందుకున్న స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు..ఉన్నతాధికారుల సూచనల మేరకు పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, శనగపాడు గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఎస్సీ సీఐ సతీష్, తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎస్‌ఐ అర్జున్ రీచ్‌లను శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తోటచర్ల గ్రామంలో జాతీయ రహదారి పక్కన అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అయితే నియోజకవర్గంలో ఇంకా పలు ప్రాంతాల్లో ఇసుక డంప్‌లు భారీఎత్తున ఉన్న వైనంపై గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా ఆయా గ్రామాల్లో డంప్ చేస్తూ జిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు తెలంగాణకు రవాణా చేస్తూ సొమ్ముచేసుకుంటున్నా, ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకపోతుండటంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు సైతం తనిఖీల పేరుతో హడావుడి చేయడం మినహా ఈ ఇసుక అక్రమరవాణాదారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతుండటమే ఇసుక అక్రమరవాణాకు ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పెనుగంచిప్రోలు ఇసుక రీచ్‌ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎస్సీ సీఐ సతీష్, ఎస్‌ఐ

పవిత్రోత్సవాలు ప్రారంభం

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా భగవదనుజ్ఞ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, మేదినీ పూజ, మత్సంగ్రహణ, అంకురార్పణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో ఫణికుమార్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బాణసంచా దుకాణాలకు ఐదు అర్జీలు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతులు తీసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామంలో పశువుల సంతలో ఏర్పాటు చేయనున్న దుకాణాల సముదాయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంతలో నాలుగు, గండ్రాయిలో ఒక దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. దుకాణదారులు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖాధికారుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్, అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



వైఎస్సార్ సీపీ కార్యకర్త బసవయ్య శవపేటికను మోస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్



కీసరలో పరిటాల రాము, వీరభద్రరావులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కంచికచర్ల అరుంధతినగర్‌కు చెందిన కార్యకర్త గౌరైపాటి బసవయ్య మృతదేహాన్ని ఆదివారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బసవయ్య కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బసవయ్య అంత్యక్రియల్లో పాల్గొని శ్మశానవాటిక వరకు శవపేటికను మోసారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ బసవయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, శేషం అనిల్‌కుమార్, శేషం వాసుబాబు, దేవిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పరిటాల' కుటుంబానికి పరామర్శ...

మండలంలోని కీసరలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘ నాయకుడు పరిటాల రాము, మాజీ సర్పంచి వీరభద్రరావు, నూకార్జున్‌లతోపాటు మరికొంతమంది నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల గణేష్ నిమజ్జన సమయంలో టీడీపీ కార్యకర్తలు రాము ఇంటికి వెళ్లి గేట్లు పగులకొట్టి ఆయన కుటుంబసభ్యులపై దాడిచేశారు. ప్రతిఘటించినందుకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రాముతోపాటు మరికొంతమంది వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులపై కేసు పెట్టారు. ఈ కేసులకు సంబంధించి బెయిల్‌పై విడుదలైనవారిని ఎమ్మెల్సీ అరుణకుమార్ పరామర్శించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్నికాలాలు ఒకేరీతిగా ఉండవని పేర్కొన్నారు. అధికారం ఉందికదాని ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి మళ్లీ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. అధికారులు సైతం అధికారపార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా అధికారులు పక్షపాత ధోరణిని విడనాడాలని, లేనిపక్షంలో న్యాయంపోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులను పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, నాయకులు వేమా సురేష్‌బాబు, బుడ్డి సత్యనారాయణ, శివనాగేశ్వరరావు, వేమవరపు పురుషోత్తం, చింతా రవీంద్రనాథ్, దేవిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, ప్రక్కన ఇంటూరి చిన్నా, అంజిరెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: అధికార తెలుగుదేశం పార్టీ అసత్య ప్రచారాలు, కుట్రలను వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సైనికులు తిప్పికొట్టాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కోదాడ రోడ్‌లోని విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జగ్గయ్యపేటలో వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ ఉందన్నారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి ఇంటూరి చిన్నాతో కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవాన్ని వచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియా కార్యకర్తలను కాపాడుకోవడంలో ఎంతవరకైనా వెళ్తామన్నారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. దీపావళి పండుగ తర్వాత జగ్గయ్యపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డా అంజిరెడ్డి మాట్లాడుతూ లీగల్‌సెల్ ద్వారా సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. సోషల్ మీడియా కార్యకర్తల సమస్యలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి ఇంటూరి చిన్నా మాట్లాడుతూ టీడీపీ దురాగతాలను ఎక్కడికక్కడే ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాను పేట రైతుబజారులో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేసినందున టమాట, ఉల్లి ధరలు దిగివచ్చాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉదయభాను జనసేనలోకి మారినప్పుడే ఆయనతో పాటు వెళ్లిన వారంతా మరలా చేరికలంటూ రోజువారీ కండువాలు కప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సోషల్ మీడియా విభాగం జిల్లా కన్వీనర్ పగిడిపల్లి చైతన్యరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల స్ఫూర్తితో సోషల్ మీడియా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. సమావేశానికి పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, వత్సవాయి జడ్పీటీసీ ఏసుపోగు దేవమణి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, నంబూరి రవి, చింతకుంట్ల వెంకటరెడ్డి, బద్దూనాయక్, శామ్యూల్, పాపినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో శ్రీతిరుపతమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ బోగస్: సీపీఎం



నందిగామ టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న సూపర్‌సిక్స్ పథకాలు అంతా బోగస్ వ్యవహారమని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. సీపీఎం పార్టీ పట్టణ 14వ మహాసభను ఆదివారం నిర్వహించారు. డీవీ కృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతోందన్నారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తాగునీటి సరఫరాలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్నా రాష్ట్రప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు కటారపు గోపాల్, కోట కళ్యాణ్, చనుమోలు సైదులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్



స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్

జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు ఇసుక డంప్‌లను శనివారం రాత్రి చిల్లకల్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 24న 'ఇసుకాయ స్వాహా' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి పోలీసులు స్పందించారు. మండలంలోని బూదవాడ, అన్నవరం గ్రామాలలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ దాడులు నిర్వహించి డంప్‌లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. డంప్‌లు అక్రమంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఘనంగా గ్యార్మీషరీఫ్ ఉత్సవం



నందిగామ టౌన్: ప్రతి ఒక్కరు న్యాయబద్ధమైన జీవితం గడపాలని, కులమత బేధాలు మరిచి కలిసిమెలిసి జీవనం సాగించాలని నూరాని మసీవు ముతావల్లి అబ్దుల్ రహీం సూచించారు. పట్టణంలోని డీవీఆర్ కాలనీలో నురాని మసీదు కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మసీదులో 15 మంది మత గురువులతో కలిసి ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 15ఏళ్లుగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ శాంతి కోసం పాటుపడటంతోపాటు తోటి వారికి సహాయ సహకారాలు అందించాలని అల్లాహ్ బోధించేవారని గుర్తు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు, గురువులు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

నందిగామ టౌన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటంతోపాటు బకాయిల చెల్లింపులపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లీయాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. నందిగామలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన నందిగామకు చెందిన వెటర్నరీ ఉద్యోగి మాడుగుల రామస్వామికి ఆయన నియామకపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం నందిగామ పట్టణ కార్యదర్శిగా గోపాల్

నందిగామ టౌన్: ప్రజాసమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధే ధ్యేయంగా సీపీఎం పార్టీ కమిటీలు కృషి చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ సూచించారు. సీపీఎం పట్టణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శిగా కటారపు గోపాల్, కమిటీ సభ్యులుగా సయ్యద్ ఖాశీం, వల్లూరు రవిశేఖర్, కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, మండూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఆకుల వెంకట నారాయణ ఎన్నికయ్యారు. నాయకులు చనుమోలు సైదులు, కోట కళ్యాణ్, బత్తుల వెంకటేశ్వర్లు, లాజరు, పుల్లయ్య, ఉప్పు శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

నందిగామటౌన్: మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడి వాతావరణంలో జరిగింది. 2015-16లో ఇక్కడ పదో తరగతి చదివిన విద్యార్థులంతా హాజరై ఆటపాటలతో సందడి చేశారు. పదోతరగతి చదువుకున్న రోజుల్లో నాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాంచార బాబు, అబ్బూరి రాజు, కొత్రపాటి యోహాన్, శేషగిరిరావులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు సద్ది కార్యక్రమం



పెనుగంచిప్రోలు: గ్రామంలో కాజ్‌వే పక్కన వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో శ్రీఅయ్యప్ప దీక్షాస్వాములకు సద్ది(భోజనం) కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. సద్ది కార్యక్రమాన్ని శ్రీఅయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ ప్రారంభించగా, మొదటి రోజు సద్ది కార్యక్రమానికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు వితరణ చేశారు. నిర్వాహకులు రేగండ్ల రవికుమార్, గింజుపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈసద్ది కార్యక్రమం 41 రోజుల పాటు సాగుతుందన్నారు. గ్రామంలోని స్వాములకే కాకుండా ఇతర గ్రామాల నుంచే వచ్చే స్వాములకు కూడా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ అనిల్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.